క్లుప్తంగా

శతాధిక వృద్ధురాలి మృతి


దోండన్‌బాయి (ఫైల్)

భైంసారూరల్: మండలంలోని ఇలేగాం గ్రామానికి చెందిన కాత్రే దోండన్‌బాయి(104) అనే వృద్ధురాలు శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందింది. స్థానికుల వివరాల ప్రకారం.. చివరిరోజుల వరకు తన పనులను తానే స్వయంగా చేసుకునేదని గ్రామస్తులు పేర్కొన్నారు.

నేడు బూసార్ బీట్ బంద్

భైంసాటౌన్: పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో శనివారం బూసార్ బీట్ బంద్ ఉంటుందని మార్కెట్ కమిటీ అధికారులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. భైంసా హమాలీ అసోసియేషన్ విన్నపం మేరకు తాత్కాలికంగా బీట్ నిలిపేస్తున్నట్లు పేర్కొన్నారు. రైతులు, కమీషన్ ఏజెంట్లు గమనించి సహకరించాలని కోరారు. తిరిగి సోమవారం బీట్ యథావిధిగా ఉంటుందని పేర్కొన్నారు.

వ్యక్తికి జరిమానా

నిర్మల్‌టౌన్: విద్యుత్ చౌర్యానికి పాల్పడిన ఓ వ్యక్తికి శుక్రవారం నిర్మల్ న్యాయస్థానం జరిమానా విధించింది. వివరాల్లోకి వెళితే.. 2019లో తానూరు మండలం మొగిలి గ్రామానికి చెందిన సాయినాథ్ సమీపంలోని విద్యుత్ తీగల నుంచి నేరుగా విద్యుత్‌ను వినియోగించుకుంటూ చౌర్యానికి పాల్పడినట్లు డిస్కం ఏఈ యోగేశ్ గుర్తించి కేసు నమోదు చేశారు. విచారణ అనంతరం నేరం రుజువు కావడంతో సాయినాథ్‌కు జిల్లా సెషన్స్ జడ్జి శ్రీవాణి రూ.9,186 జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు.

కాంగ్రెస్ నేతల క్షీరాభిషేకం


క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఖానాపూర్: ఖానాపూర్ పట్టణ అభివృద్ధికి ప్రభుత్వం రూ.15 కోట్లు మంజూరు చేయడంపై కాంగ్రెస్ నాయకులు సీఎం, ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ చిత్రాలతో కూడిన ఫ్లెక్సీకి శుక్రవారం క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో దయానంద్, నిమ్మల రమేష్, చిన్నం సత్యం, ఎంఏ మాజిద్, అంకం రాజేందర్, షబ్బీర్ పాషా, సంతోష్, కిశోర్‌నాయక్, జహీర్ అహ్మద్, హరిప్రసాద్ తదితరులు ఉన్నారు.

రోడ్డు కోసం కదిలొచ్చారు


శ్రమదానం చేస్తున్న యువకులు

కుంటాల: భారీవర్షాలకు మండలంలోని అంబుగామ గ్రామానికి వెళ్లే ఘాట్ రోడ్డు కోతకు గురై గుంతలమయంగా మారింది. శుక్రవారం గ్రామ యువకులు, గ్రామస్తులు శ్రమదానం చేసి తాత్కాలికంగా రోడ్డు వేసుకున్నారు. గతంలో కలెక్టర్ అభిలాష అభినవ్‌కు రోడ్డు సమస్య విన్నవించినా మరమ్మతులు చేపట్టలేదని గ్రామస్తులు వాపోయారు.

పాటల సీడీ ఆవిష్కరణ

దిలావర్‌పూర్: మండలంలోని సాంగ్వి మహాపోచమ్మ ప్రాశస్త్యం, గంగనీళ్ల జాతర విశేషాలతో జిల్లా కళాకారులు రూపొందించిన పాటల సీడీని శుక్రవారం సాంగ్వి గ్రామంలో మహాపోచమ్మ ఆలయ కమిటీ చైర్మన్ పంతుల సుభాశ్ ఆవిష్కరించారు. పాటలు రాసి పాడిన ఎలిశెట్టి సుదర్శన్, మహిపాల్, మాధురి రాజాను ఘనంగా సన్మానించారు.

ప్రశాంతంగా 'ఓపెన్' పరీక్షలు

నిర్మల్‌రూరల్: జిల్లాలో ఓపెన్ పదో తరగతి, ఇంటర్ పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. శుక్రవారం పదోతరగతి పరీక్షలకు 78 మంది విద్యార్థులకు గాను 59 మంది హాజరవగా 19 మంది గైర్హాజరయ్యారు. ఇంటర్ పరీక్షలకు 48 మంది విద్యార్థులకు గాను 44 మంది హాజరవగా నలుగురు గైర్హాజరయ్యారు. డీఈడీలో 59 మందికి గాను 55 మంది పరీక్షలు రాశారు. జిల్లాకేంద్రంలోని పరీక్ష కేంద్రాలను డీఈఓ భోజన్న, ప్రభుత్వ పరీక్షల సహాయ కమిషనర్ ముడారపు పరమేశ్వర్ తనిఖీ చేశారు. పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని సిబ్బందిని ఆదేశించారు.

'అర్హులకు పట్టాలివ్వాలి'

ఖానాపూర్: పట్టణంలోని కుమురంభీం చౌరస్తాలో డబుల్ బెడ్‌రూం ఇళ్లలో ఉంటున్న అనర్హులను ఖాళీ చేయించి.. సదరు ఇళ్లను అర్హులకు కేటాయించి పట్టాలు ఇవ్వాలని ఖానాపూర్‌కే చెందిన బాధిత పేదలు కోరారు. శుక్రవారం పట్టణంలో విలేకరులతో మాట్లాడారు. ఇళ్లు లేక అవస్థలు పడుతున్నారని.. సమస్య పరిష్కరించాలని అధికారులను వేడుకున్నారు. జాఫర్, పద్మ తదితరులు ఉన్నారు.

నిర్మాణాలు చేపట్టాలి

లోకేశ్వరం: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పకడ్బందీగా చేపట్టాలని ఎంపీవో సురేశ్ చందర్ గౌడ్ అన్నారు. మండలంలోని ధర్మోరలో శుక్రవారం 10 ఇళ్ల నిర్మాణాలకు ముగ్గు పోశారు. నాయకులు అర్ష ముత్తన్న, గోవింద్ రావు, భోజన్న ఉన్నారు.

గుంత చూసి నడపండి



లోకేశ్వరం: భారీవర్షాలకు మండలంలోని రాయపూర్‌కాండ్లీ గ్రామ సమీపంలో ఎడ్‌బిడ్‌కు వెళ్లే మార్గంలో కల్వర్టు వద్ద రోడ్డు కోతకు గురై గుంత ఏర్పడింది. ఈ మార్గంలో రాకపోకలు సాగించే వాహనదారులకు ముప్పు పొంచి ఉంది. ప్రమాదం జరగక ముందే అధికారులు గుంతను పూడ్చివేయాలని ప్రజలు కోరుతున్నారు.

వామ్మో.. వీధికుక్కలు



లోకేశ్వరం: మండలంలోని పంచగుడి, ధర్మోర, లోకేశ్వరం గ్రామాల్లో వీధికుక్కలు గుంపులుగుంపులుగా తిరుగుతూ ప్రజలపై దాడులు చేస్తున్నాయి. దీంతో ఇళ్ల నుంచి బయటకు వచ్చేందుకు ప్రజలు జంకుతున్నారు. లోకేశ్వరం నుంచి నందిపేట్ వైపు వెళ్లే ద్విచక్ర వాహనదారులను కుక్కలు వెంబడిస్తూ కరుస్తున్నాయి. లోకేశ్వరం పీహెచ్‌సీలో రోజుకు ముగ్గురి నుంచి నలుగురు బాధితులకు చికిత్స అందిస్తున్నట్లు వైద్యురాలు శైలజ తెలిపారు. అధికారులు స్పందించి కుక్కల బెడద నిర్మూలించాలని ప్రజలు కోరుతున్నారు.

బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో..


కుభీర్‌లో బతుకమ్మ ఆడుతున్న విద్యార్థినులు

కుభీర్: మండలకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం బతుకమ్మ సంబురాలు నిర్వహించారు. తీరొక్క పూలతో పేర్చిన బతుకమ్మల వద్ద విద్యార్థినులు, అధ్యాపకులు ఆడిపాడారు. అనంతరం వాగులో నిమజ్జనం చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ డి.సునీల్, అధ్యాపకులు రమేశ్, సంపత్, శివరాజ్, హన్మంతు, భాస్కర్‌నర్సయ్య, మాధవి తదితరులు ఉన్నారు.


ఖానాపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో..

ఖానాపూర్: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, అధ్యాపకులు కలిసి బతుకమ్మ ఆడారు. అంతకుముందు ప్రిన్సిపాల్ ఆనందం ఆధ్వర్యంలో పేరెంట్స్ కమిటీ సమావేశం నిర్వహించారు. విద్యార్థుల హాజరు, చదువుల ప్రగతి చర్చించారు. అధ్యాపకులు, పోషకులు లలిత కుమారి, వీణ, సంతోష్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ఆలయాల అభివృద్ధికి కృషి

- బీజేఎల్పీ నేత మహేశ్వర్ రెడ్డి

నిర్మల్‌చైన్‌గేట్: నియోజకవర్గంలో ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తానని బీజేఎల్పీ నేత, ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని గాజులపేట్ కాలనీలో రూ.20 లక్షలతో చేపట్టే చిలకల చిన్నమ్మ ఆలయ నిర్మాణ పనులను శంకుస్థాపన చేశారు. అనంతరం కాలనీలోని శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. బీజేపీ నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మండలంగా ఏర్పాటయ్యేలా చూస్తా

మామడ: మండలంలోని పొన్కల్ గ్రామాన్ని మండలంగా ఏర్పాటు చేసేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని పొన్కల్ సదర్మాట్ వద్ద రూ.50 లక్షలతో చేపట్టే నాగదేవతాలయం నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. బ్యారేజి నుంచి లిఫ్ట్ ఇరిగేషన్ ఏర్పాటు చేయించి నష్టపోయిన రైతులకు న్యాయం చేస్తానని పేర్కొన్నారు. ఈసందర్భంగా పొన్కల్‌ను మండలంగా చేయాలని గ్రామస్తులు విన్నవించారు. అంతకుముందు మామడలో ఛత్రపతి శివాజీ మహరాజ్ విగ్రహం ఆవిష్కరించారు. పిడుగుపాటుకు గురైన కొరిటికల్‌లోని వేంకటేశ్వరాలయం సందర్శించి.. మరమ్మతులకు నిధులు మంజూరు చేస్తానని పేర్కొన్నారు. బీజేపీ నాయకులు రావుల రాంనాథ్, మెడిసెమ్మె రాజు, బాపురెడ్డి, రాజారెడ్డి, చక్రపాణి, నవీన్, చిన్నారెడ్డి, నరేశ్, నరేందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఎత్తిపోతలతో సాగు విస్తీర్ణం పెంపు

సారంగాపూర్: ఎత్తిపోతల పథకాలతో సాగువిస్తీర్ణం పెరిగి రైతులకు ఆర్థిక ప్రయోజనం చేకూరుతుందని, బీజేఎల్పీ నేత మహేశ్వర్‌రెడ్డి అన్నారు. మండలంలోని ఆలూరు ఎత్తిపోతల పథకం పునరుద్ధరణకు ప్రభుత్వం రూ.32.50 లక్షల నిధులు విడుదల చేసింది. దీంతో ఎమ్మెల్యే శుక్రవారం పనులు ప్రారంభించారు. పనులు పూర్తయితే వెయ్యి ఎకరాలకు నీరందుతుందని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు తోట భోజన్న, ఈర్ల చిన్నయ్య, సాయేందర్, విజయ్, మధు, తిరుమలాచారి, కాల్వ నరేశ్, పోతన్న, ఆయా గ్రామాల నాయకులు, మండల కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.


మామడ: పొన్కల్‌లో ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి

ఐలమ్మ ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలి

వీరనారి చాకలి ఐలమ్మ ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి అన్నారు. ఐలమ్మ జయంతి సందర్భంగా ఆలూరులో నూతనంగా ఏర్పాటు చేసిన చాకలి ఐలమ్మ విగ్రహాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో రావుల రాంనాథ్, గంగారెడ్డి, మండల అధ్యక్షుడు కాల్వ నరేశ్, విలాస్, తిరుమలాచారి, చిన్నయ్య, విజయ్, బడి పోతన్న, సాయేందర్ తదితరులు పాల్గొన్నారు.

దొంగలొస్తున్నారు..!

- తాళం వేసి ఉన్న ఇళ్లే టార్గెట్
- అప్రమత్తంగా ఉండాలంటున్న పోలీసులు

నిర్మల్‌టౌన్: బతుకమ్మ, దసరా పండుగలకు పిల్లలకు సెలవులు ఉండడంతో చాలామంది సొంత ఊళ్లు, విహారయాత్రలకు వెళ్తుంటారు. ఇదే అదునుగా భావిస్తున్న దొంగలు రెచ్చిపోతున్నారు. తాళం వేసి ఉన్న ఇళ్లను లక్ష్యంగా చేసుకొని అందిన కాడికి దండుకుంటున్నారు. పక్కా ప్లాన్‌తో ఇళ్లు, దుకాణాల్లో లూటీ చేస్తూ నగదు, విలువైన వస్తువులు, ఇంటి బయట పార్కు చేసిన వాహనాలనూ ఎత్తుకెళ్తున్నారు. గతంలో రాత్రి వేళ మాత్రమే దొంగతనాలు జరిగేవి. కానీ ప్రస్తుతం రాత్రి, పగలనే తేడా లేకుండా దొంగలు ఇళ్లల్లోకి చొరబడి విలువైన సామగ్రితో పరావుతున్నారు. పోలీసులు పెట్రోలింగ్ డ్యూటీలు పెంచి దొంగలను పట్టుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

జాగ్రత్త పడుతున్న దొంగలు..

నిఘా విభాగం ఎంతో అభివృద్ధి చెందిన ఈ రోజుల్లోనూ దొంగలు పోలీసుల చేతికి చిక్కకుండా తప్పించుకు తిరుగుతున్నారు. రాత్రి, పగలు గస్తీ కాస్తున్న పోలీసులకు ఆనవాళ్లు దొరకకుండా జాగ్రత్త పడుతున్నారు. జిల్లా సరిహద్దులో మహారాష్ట్ర ఉండడంతో నిత్యం ప్రజల రాకపోకలు కొనసాగుతుంటాయి. వేరే ప్రాంతాల నుంచి వచ్చిన వ్యక్తులు నేరుగా దొంగతనాలు చేసి పారిపోతున్నారనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.


నిర్మల్‌లో దొంగతనం జరిగిన ఇంట్లో వివరాలు సేకరిస్తున్న క్లూస్, ఫింగర్ ప్రింట్ బృందాలు

జిల్లాలో ఇటీవల జరిగిన ఘటనలు

- ఈనెల 21న బాసరలో దొంగలు బీభత్సం సృష్టించారు. బాసర బస్టాండ్ వద్ద శారద బేకరీ షట్టర్ తాళాలు పగలగొట్టి నగదు ఎత్తుకెళ్లారు.
- ఈనెల 22న తానూరు మండలకేంద్రంలోని శ్రీ లక్ష్మీ వైన్‌షాపు వెనుక ఉన్న రేకులను తొలగించి లోనికి చొరబడ్డారు. రూ.లక్ష విలువైన మద్యం బాటిళ్లు, రూ.8 వేల నగదు ఎత్తుకెళ్లారు.
- ఇటీవల లక్ష్మణచాంద మండలం రాచాపూర్‌లో రవి అనే వ్యక్తి బైకును ఎత్తుకెళ్లారు.
- ఈనెల 25న తెల్లవారుజామున జిల్లా కేంద్రంలోని ఏ.ఎన్ రెడ్డి కాలనీలో దొంగలు తాళం వేసిన ఇంటిని చోరీ చేశారు. స్కూల్ అసిస్టెంట్ రమేష్ చందర్‌గౌడ్ తన ఇంటికి తాళం వేసి మహారాష్ట్రలోని కూతురు ఇంటికి వెళ్లాడు. తాళాలను పగలగొట్టి సుమారు ఐదున్నర కేజీల వెండి, తులంన్నర బంగారు ఆభరణాలు చోరీ చేశారని బాధితుడు వాపోయాడు. అదే సమయంలో ఈద్గాం వద్ద ఇంటి బయట నిలిపిన బైకును ఎత్తుకెళ్లారు.

రాత్రింబవళ్లు గస్తీ కాస్తున్నాం



ఇళ్లల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి. దూర ప్రాంతాలకు వెళ్లేవారు చుట్టుపక్కల వారితోపాటు పోలీసులకు సమాచారం ఇస్తే వారిపై ఇంటిపై నిఘా పెడతాం. ఎస్పీ ఆదేశాల మేరకు రాత్రింబవళ్లు గస్తీ కాస్తున్నాం. సీసీ కెమెరాల ద్వారా పట్టణాన్ని నిరంతరం పర్యవేక్షిస్తున్నాం.

– ప్రవీణ్‌కుమార్, నిర్మల్ పట్టణసీఐ

సీఎంఆర్‌ఎఫ్‌తో పేదలకు భరోసా

నిర్మల్‌చైన్‌గేట్: పేద కుటుంబాలకు సీఎం సహాయ నిధి భరోసాగా నిలుస్తుందని డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరిరావు అన్నారు. శుక్రవారం జిల్లాకేంద్రంలోని తన క్యాంపు కార్యాలయంలో నిర్మల్ నియోజకవర్గంలోని 107 మంది లబ్ధిదారులకు రూ.40.76లక్షల విలువైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందజేశారు. నిర్మల్, సారంగాపూర్ ఏఎంసీ చైర్మన్లు భీమ్‌రెడ్డి, అబ్దుల్ హాది, నిర్మల్ మాజీ మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఎంబడి రాజేశ్వర్, ఆత్మ కమిటీ చైర్మన్ రాంరెడ్డి, మండలాల అధ్యక్షులు కుంట వేణుగోపాల్, మధుకర్‌రెడ్డి, రాజేశ్వర్, నర్సయ్య, శ్రీనివాస్‌రెడ్డి, విద్యాసాగర్‌రెడ్డి, ఇంద్రకరణ్‌రెడ్డి, నాయకులు ఉన్నారు. జిల్లాకేంద్రంలోని బంగల్‌పేట్ శ్రీ మహాలక్ష్మి ఆలయం, శ్రీ నందిగుండం దుర్గాదేవి ఆలయంలో శ్రీహరి రావు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు సన్మానించారు. వారి వెంట పలువురు నాయకులు ఉన్నారు.


చెక్కులు అందుకున్నవారితో శ్రీహరిరావు

వంతెనకు నిధులు మంజూరు చేయాలి

లక్ష్మణచాంద: మండలంలోని ధర్మారం నుంచి సోన్ మండలకేంద్రానికి వెళ్లే రోడ్డు మార్గంలో వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరుతూ మండలంలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు శుక్రవారం నిర్మల్‌లో డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావుకు విన్నవించారు. నరేశ్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, లింగారెడ్డి తదితరులు ఉన్నారు.

పత్రాల్లేకుంటే వాహనాలు సీజ్

- ముధోల్ సీఐ మల్లేశ్

బాసర: పత్రాలు లేకుంటే వాహనాలను సీజ్ చేస్తామని ముధోల్ సీఐ మల్లేశ్ పేర్కొన్నారు. శుక్రవారం తెల్లవారుజామున బాసరలోని శారదనగర్‌లో పోలీసులు కార్డన్‌సెర్చ్(కమ్యూనిటీ కాంటాక్ట్) నిర్వహించారు. స్థానికుల ఇళ్లకు వెళ్లి వివరాలు సేకరించారు. అనుమానితులుంటే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజలు సహకరించాలని కోరారు. ఈసందర్భంగా సరైన పత్రాలు లేని 37బైక్‌లు, ఆరు ఆటోలను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం సైబర్ మోసాలపై స్థానికులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పలు పోలీస్‌స్టేషన్ల సిబ్బంది పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న సీఐ మల్లేశ్

ఘనంగా దుర్గాదేవికి పూజలు


నిర్మల్‌లో బోనాలతో వస్తున్న భక్తులు


మామడ: పొన్కల్‌లో అమ్మవారి అలంకరణ

జిల్లాలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. ఐదోరోజైన శుక్రవారం అమ్మవారు ధనలక్ష్మీ అవతారంలో భక్తులకు దర్శనమిచ్చింది. నిర్మల్‌రూరల్ మండలం కొండాపూర్ గ్రామస్తులు కాలినడకన వచ్చి నిర్మల్‌లోని నందిగుండం దుర్గాదేవిని దర్శించుకున్నారు. నిర్మల్‌లోని రవినగర్ హనుమాన్ ఆలయంలో దుర్గాదేవిని నిర్మల్ ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి సతీమణి కవిత దర్శించుకున్నారు. మామడ మండలం పొన్కల్ గ్రామ అంగడిబజార్‌లో దుర్గామాతను రూ.58వేల విలువైన నోట్లతో ధనలక్ష్మిగా అలంకరించారు. గాజుల వేడుక, హోమం, కుంకుమార్చనలు నిర్వహించి.. బోనాలను అమ్మవారికి సమర్పించారు. – సాక్షి నెట్‌వర్క్


లక్ష్మణచాంద: పొట్టపెల్లిలో మండపం వద్ద..


కుంటాల: విఠాపూర్‌లో బోనాలతో భక్తులు

జూనియర్ కళాశాలల్లో పేరెంట్–టీచర్ మీటింగ్

భైంసాటౌన్/దిలావర్‌పూర్/నిర్మల్‌రూరల్/సారంగపూర్/లోకేశ్వరం/కుంటాల/తానూరు: జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో శుక్రవారం పేరెంట్– టీచర్ మీటింగ్(అధ్యాపకులతో పోషకుల సమావేశం) నిర్వహించారు. ఈసందర్భంగా ఆయా కళాశాలల ప్రిన్సిపాళ్లు మాట్లాడారు. అనుభవజ్ఞులైన అధ్యాపకులతో కార్పొరేట్‌కు దీటుగా నాణ్యమైన విద్య, అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామని.. విద్యార్థులు ప్రతిరోజు కళాశాలకు హాజరయ్యేలా చూడాలని విద్యార్థుల తల్లిదండ్రులకు సూచించారు. ఇంటి వద్ద చదివేలా జాగ్రత్తలు తీసుకుంటే భవిష్యత్‌లో ఉన్నత స్థానాలకు ఎదుగుతారన్నారు. కళాశాలల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి ఎఫ్ఆర్ఎస్(ఫేషియల్ రికగ్నైజేషన్ సిస్టం) ద్వారా హాజరు నమోదు చేస్తున్నామని.. ప్రతి విద్యార్థికి పూర్తి రక్షణ, భరోసా ఉంటుందని పేర్కొన్నారు. విద్యార్థులకు జేఈఈ, నీట్‌తో పాటు ఇతర ప్రవేశపరీక్షలకు కోచింగ్ ఇస్తున్నామని అన్నారు. విద్యార్థుల హాజరు, చదువుల ప్రగతి వారి తల్లిదండ్రులకు వివరించారు. తల్లిదండ్రుల సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాళ్లు శివరంజని(భైంసా), సుదర్శన్(దిలావర్‌పూర్), కుంటాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సురేశ్, గౌతమ్(లోకేశ్వరం), తుకారం(నిర్మల్), శంకర్(సారంగపూర్), ఫణి రాజశేఖర్(తానూరు), అధ్యాపకులు పాల్గొన్నారు.


సారంగపూర్ జూనియర్ కళాశాలలో సమావేశానికి హాజరైన పోషకులు


నిర్మల్‌లోని బాలుర జూనియర్ కళాశాలలో మాట్లాడుతున్న అధ్యాపకురాలు విజయలక్ష్మి

వీరనారి ఐలమ్మకు నివాళి


కుంటాల: అందకూర్‌లో..


కుభీర్: చాతాలో నివాళులర్పిస్తున్న నాయకులు


నిర్మల్‌లోని పోలీస్ ప్రధాన కార్యాలయంలో..


బాసరలో ఐలమ్మ విగ్రహం వద్ద..


లక్ష్మణచాందలోని ఐలమ్మ విగ్రహం వద్ద..

తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, భూమి కోసం భుక్తి కోసం విముక్తి పోరాడిన మహనీయురాలు చాకలి ఐలమ్మ అని పలువురు పేర్కొన్నారు. శుక్రవారం జిల్లావ్యాప్తంగా చాకలి ఐలమ్మ జయంతి ఘనంగా నిర్వహించారు. మున్సిపాలిటీలతోపాటు మండలకేంద్రాలు,గ్రామాల్లో ఐలమ్మ విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. జిల్లా కేంద్రంలోని ప్రధాన పోలీస్ కార్యాలయంలో ఆమె చిత్రపటానికి నివాళులర్పించారు. ఆయా కార్యక్రమాల్లో అధికారులు, వివిధ పార్టీల నాయకులు, రజకసంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు. – సాక్షి నెట్‌వర్క్

సంక్షిప్త వార్తలు

దివ్యాంగశక్తి సేవలు అభినందనీయం

భైంసాటౌన్: దివ్యాంగశక్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో దివ్యాంగుడు పంచగుడి మహేశ్ చేపడుతున్న సేవలు అభినందనీయమని సీడీపీఓ రాజశ్రీ అన్నారు. శుక్రవారం పట్టణంలోని పీఆర్‌టీయూ భవన్‌లో ఫౌండేషన్ ఆధ్వర్యంలో కృత్రిమ కాళ్ల కోసం దివ్యాంగుల నుంచి కొలతల శిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా 21 మంది నుంచి కొలతలు తీసుకున్నారు. పంచగుడి మహేశ్, కృత్రిమ కాళ్లు తయారీ చేసే పాంచాల్ శ్యాం ఉన్నారు.

వార్కరి భక్తుల పాదయాత్ర

తానూరు: నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని మండలంలోని వార్కరి భక్తులు శుక్రవారం బోరిగాం మహాదేవుడి ఆలయం నుంచి బాసర వరకు పాదయాత్రగా తరలివెళ్లారు. బాసర సరస్వతి అమ్మవారి ఆలయంలో పూజలు నిర్వహించి తిరుగుప్రయాణం చేయనున్నట్లు ఆ భక్తుల సంఘం నాయకులు గంగాధర్ మహరాజ్ తెలిపారు.

4న ఖానాపూర్‌లో బతుకమ్మ

ఖానాపూర్: అక్టోబర్ 1న దుర్గాదేవి ప్రతిమల నిమజ్జనం అనంతరం 2న దసరా, 4వ తేదీన బతుకమ్మ ఉత్సవాలను జరుపుకోవాలని పట్టణ వైదిక బ్రాహ్మణ సంఘం నాయకులు కోరారు. శుక్రవారం ఖానాపూర్‌లో హిందూ ఉత్సవ సమితి నాయకుల సమావేశంలో ఖానాపూర్ వైదిక బ్రాహ్మణ సంక్షేమ సంఘం సమష్టిగా నిర్ణయించినట్లు సంఘం అధ్యక్షుడు సందీప్‌శర్మ తెలిపారు. కార్యక్రమంలో హిందూ ఉత్సవ సమితి అధ్యక్ష, కార్యదర్శులు మంత్రరాజం సురేష్, శెట్టి శ్యాం మోహన్‌రావు, నాయకులు తదితరులు ఉన్నారు.

బీజేపీ నేతల క్షీరాభిషేకం

నిర్మల్‌టౌన్: అభివృద్ధికి నిధులు మంజూరు చేయించినందుకు శుక్రవారం నిర్మల్‌లోని సోఫీనగర్ పరిధి 14వవార్డులో నిర్మల్ ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి చిత్రపటానికి బీజేపీ నాయకులు క్షీరాభిషేకం చేశారు. పొన్నం రాహుల్‌గౌడ్ , నారాయణగౌడ్, సింగం, సంతు, రవి, శ్రీకాంత్, రానా పాల్గొన్నారు.

నిర్మల్‌లో 'స్వచ్ఛతా హీ సేవా'


శుభ్రం చేస్తున్న మున్సిపల్ సిబ్బంది

నిర్మల్‌టౌన్: జిల్లాకేంద్రంలోని శ్యామ్‌ఘడ్ కోట వద్ద శుక్రవారం స్వచ్ఛత హీ సేవా కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్‌గౌడ్, సిబ్బంది పరిసరాలను శుభ్రం చేసి స్వచ్ఛత ప్రతిజ్ఞ చేశారు. తడి, పొడి, హానికర చెత్తపై ప్రజలకు అవగాహన కల్పించారు. కమిషనర్ మాట్లాడుతూ ప్రతి వారం రెండు గంటలు స్వచ్ఛందంగా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకునేందుకు కేటాయించాలని పేర్కొన్నారు. అందరూ కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు దేవిదాస్, ప్రవీణ్‌కుమార్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.